

## నా కోసం నా ఫ్యామిలీ ఎన్నో త్యాగాలు చేసింది

తెలుగు ఇండస్ట్రీలో తెలుగమ్మాయిలకి అవకాశాలు రావడం చాలా తక్కువ అని నటి కామాక్షి భాస్కర్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'అగధ' సినిమా విడుదలకు సిద్ధమైంది. ఎంఎస్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం.. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా సోమవారం హైదరాబాద్ లో ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కామాక్షి భావోద్వేగానికి గురయ్యారు. తనకు లీడ్ రోల్ లో సినిమా రావడానికి తొమ్మిదేళ్లు పట్టిందని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎంఎస్ రాజుకి జీవితాంతం రుణపడి ఉంటానంటూ కామాక్షి కన్నీళ్లు పెట్టుకున్నారు.

కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ .. "ఎంఎస్ రాజు చెప్పిన క్యారక్టర్ కోసం చాలా హోమ్ వర్క్ చేశాను. నాకు చాలా పెద్ద బాధ్యత ఇచ్చారు. 'అగధ' జర్నీలో ఎంతో మంది నుంచి ఎంతో నేర్చుకున్నాను. నేను 2017 ఆగస్టులో ఇండియాకి వచ్చాను. లీడ్ రోల్ లో నాకు ఇలాంటి ఒక సినిమా రావడానికి 9 ఏళ్లు పట్టింది. ఎంఎస్ రాజు గారి వల్లే ఇది సాధ్యమైంది. తెలుగు ఇండస్ట్రీలో తెలుగమ్మాయిలకు అవకాశాలు రావడమే చాలా తక్కువ. అది అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. ఇలాంటి టైంలో నాకు ఫీమేల్ లీడ్‌గా, సెంటర్ కారెక్టర్ ఇచ్చి, నన్ను నమ్మినందుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అంటూ ఎమోషనల్ అయ్యారు.

"నా కోసం నా ఫ్యామిలీ ఎన్నో త్యాగాలు చేసింది. ఎలాంటి నేపథ్యం లేకుండా ఇక్కడి వరకు రావడం కూడా ఓ విజయమే. ఇంకో పదేళ్లు ఇండస్ట్రీలో ఉన్నా కూడా ఎంఎస్ రాజు గారి గురించి చెప్తాను. రాజు గారే నా కెరీర్‌కి పునాది వేశారని గర్వంగా చెప్పకుంటాను. మేం కష్టపడి, ఇష్టపడి 'అగధ' మూవీ చేశాం. అదే ప్రేమను ఆడియెన్స్ తిరిగి ఇస్తారని ఆశిస్తున్నాను" అని కామాక్షి భాస్కర్ల చెప్పకొచ్చారు. ఏఈ సందర్భంగా 'అగధ 2' సినిమా కామాక్షితో తీస్తామని నిర్మాత ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ఏలూరుకి చెందిన తెలుగమ్మాయి కామాక్షి భాస్కర్ల.. చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఇండియాకి వచ్చి అపోలో హాస్పిటల్‌లో కొంతకాలం డాక్టరుగా పని చేశారు. ఆ తర్వాత మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి, 2018లో 'మిస్ తెలంగాణ' టైటిల్ గెలుచుకున్నారు. అదే ఏడాది 'మిస్ ఇండియా' ఫైనల్స్ వరకు చేరుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. 2021లో 'ప్రియురాలు' అనే సినిమాతో తెరంగేట్రం చేసిన కామాక్షి.. 'మా ఊరి పొలిమేర' చిత్రంతో తొలి బ్రేక్ అందుకున్నారు. 'మా ఊరి పొలిమేర 2', '12A రైల్వే కాలనీ', 'లైలా', 'డెకాయిట్', 'షో టైమ్' వంటి చిత్రాలతో అలరించారు. ఇప్పుడు 'అగధ' సినిమాలో లీడ్ రోల్ లో అలరించడానికి రెడీ అయ్యారు. కామాక్షి నటించిన 'పొలిమేర 3' సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## బోనాల పండుగలో చిట్టి సందడి

హైదరాబాద్‌లోని మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా సందడి చేశారు. పక్కా తెలంగాణ అమ్మాయిలా అమ్మవారి దర్శనం చేసుకుని ఊరమాస్ డప్పు చప్పుళ్లకు క్రేజీ స్టెప్పులేస్తూ అభిమానులను ఖుషీ చేశారు. తెలంగాణ సంస్కృతిని చూసి తాను తీవ్ర భావోద్వేగానికి గురయ్యానని, ఇక్కడి ప్రజల ఆప్యాయత ప్రపంచంలో ఎక్కడా దొరకదని సంతోషం వ్యక్తం చేశారు. బోనాల వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఫరియా అబ్దుల్లా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి మాట్లాడుతూ కాస్త ఎమోషనల్ అయ్యారు. "తెలంగాణ ప్రజల హృదయాలు ఎంతో విశాలమైనవి. బయట నుంచి వచ్చే ప్రతి ఒక్కరినీ ఇక్కడి జనాలు తమ సొంత మనుషుల్లా ఆదరిస్తారు. ఇలాగే ఉండాలి" అని చెప్పారు.

ఎలాంటి భేషజాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పండుగలు జరుపుకోవడం నిజంగా అద్భుతమని కొనియాడారు. హైదరాబాద్ సంస్కృతిలో భాగం కావడం తనకెంతో గర్వంగా ఉందంటూ మనస్ఫూర్తిగా ప్రశంసలు కురిపించారు. ఇలా మాట్లాడుతూనే ఆమె కంటతడి పెట్టారు. ఆమె అలా ఎమోషనల్ అవడం చూసి అక్కడున్న వాళ్లంతా షాక్ తిన్నారు.

'జాతి రత్నాలు' సినిమాలో 'చిట్టి' పాత్రతో టాలీవుడ్‌లో ఓవర్ నైట్ స్టార్‌డమ్ సంపాదించుకున్న ఫరియా అబ్దుల్లా.. తన యాక్టింగ్, డాన్స్ స్కిల్స్‌తో టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకున్నారు. కేవలం నటనలోనే కాకుండా వెస్ట్రన్, క్లాసికల్, మాస్ డాన్స్ ఫారమ్‌లలో ఆమెకు అద్భుతమైన ప్రవేశం ఉంది.

రీసెంట్‌గా గాయపడ్డ సింహం, 'మత్తు వదలరా 2', 'రావణాసుర', 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' లాంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఈ పొడుగుకాళ్ల సుందరి.. ప్రైవేట్ ఆల్బమ్స్ లోనూ తనదైన మార్క్ చూపించారు. ఇప్పుడు స్వయంగా బోనాల జాతరలో పాల్గొని మాస్ స్టెప్పులు వేయడంతో తెలంగాణ ఆడియన్స్ ఆమెపై మరింత అభిమానాన్ని చూపిస్తున్నారు.

ప్రస్తుతం ఫరియా చేసిన ఈ మాస్ డ్యాన్స్ క్లిప్స్ నెట్టింట ట్రెండింగ్‌లో నిలిచాయి. నెటిజన్లు, ఫ్యాన్స్ ఈ వీడియోలను షేర్ చేస్తూ "మన హైదరాబాద్ పిల్ల.. రచ్చ లేపిందిగా!" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అలాగే తెలంగాణ కల్చర్ పట్ల ఆమె చూపిస్తున్న అభిమానానికి కూడా ఫిదా అవుతున్నారు.



## కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం

అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది, 'పళ్ళ బురుసు' ఆగస్టు 14న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు కింగ్ నాగర్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రెస్ మీట్ లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ: అన్నపూర్ణ స్టూడియోస్‌కు ఇది 50వ సంవత్సరం. నాన్న గారు ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించాం. జాతీయ అవార్డులు అందుకున్న సినిమాలను కూడా రూపొందించాం. ఈ 50వ సంవత్సరం సందర్భంగా మా టీమ్ అంతా కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. అందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్‌ను విస్తరించాం. నాన్నగారు సినిమాలు చేసిన రోజుల్లో డిస్ట్రిబ్యూషన్ ఎలా ఉండేదో, ఆ పద్ధతిని మళ్లీ తీసుకురావడంతో పాటు దాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నాం. ఇటీవలే డిస్ట్రిబ్యూషన్‌ను ప్రారంభించాం. అది చాలా విజయవంతంగా సాగుతోందని అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఎన్నో మంచి సినిమాలు చేశాం. ఇకపై మరింత వేగంగా, మరింత బలంగా సినిమాలు చేయాలని, మరింతమంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగానే ఈ సినిమాలను ప్రారంభించాం అన్నారు నాగార్జున. మొన్ననే 'లెనిన్'ను రిలీజ్ చేశాం. ఇప్పుడు 'పళ్ళ బురుసు'ను విడుదల చేస్తున్నాం. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక' సినిమాను రిలీజ్ చేయబోతున్నాం. ఆ తర్వాత మరో రెండు సినిమాలు కూడా ఉన్నాయి. వీటితో పాటు నా 'కింగ్ 100' కూడా రాబోతోంది. ఇకపై అన్నపూర్ణ స్టూడియోస్ చాలా బిజీగా ఉంటుంది. ఇకపై మరింత జోరుగా సినిమాలు చేయబోతున్నాం.. 'పళ్ళ బురుసు' సినిమా గురించి చెప్పాలంటే.. తల్లిదండ్రులను చూసుకోవడం కంటే అదృష్టం మరొకటి ఉండదు. నా తల్లిదండ్రులను నేను చూసుకున్నాను. వాళ్లు నన్ను చిన్నప్పుడు చూసుకున్నారు. మనకు చిన్నప్పుడు ఏ భయం వచ్చినా తల్లిదండ్రుల చేయి పట్టుకుంటాం. మనం పెద్దయ్యాక వాళ్ల బాధ్యతను తీసుకోవాలి. ఎవరైనా సరే తల్లిదండ్రులకు సేవ చేయాలి. అమల తన పేరెంట్స్ ని అద్భుతంగా చూసుకుంటుంది. తనతో ఎప్పుడూ చెబుతుంటాను.. తనకంటే అదృష్టవంతురాలు ఎవరూ లేరని. తల్లిదండ్రులను చూసుకోవడం చాలా ముఖ్యం అన్నారు నాగ్.



## టాలెంట్ ఉంటే.. 'కల్కి 2'లో నటించే ఛాన్స్..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమాకు దేశవ్యాప్తంగా ఎంతటి ఘన విజయాన్ని సొంతం చేసుకుందో తెలిసిందే. నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లో వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రం పురాణాలు, సైన్స్ ఫిక్షన్ అంశాలను మేళవిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో ప్రభాస్ భైరవగా, కర్ణుడిగా నటించగా, అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా, కమల్ హాసన్ సుప్రీమ్ యాస్కిన్‌గా, దీపికా పదుకొనె సుమతిగా కనిపించారు. ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కల్కి సినిమాటిక్ యూనివర్స్‌లో భాగం కావాలనుకునే ఔత్సాహిక నటీనటులకు మేకర్స్ ఓ ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నారు. నటనపై ఆసక్తి, ప్రతిభ ఉన్నవారు తమ వివరాలను పంపించాలని అధికారికంగా కాస్టింగ్ కాల్ ఇచ్చారు.

"ఆస్పైరింగ్ యాక్టర్స్ అందరికీ ఇదో మంచి అవకాశం. కల్కి సినిమాటిక్ యూనివర్స్‌లో భాగం కండి" అంటూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆసక్తి ఉన్న నటీనటులు తమ ప్రొఫైల్, నటనకు సంబంధించిన వివరాలను [kalkiuniversecasting@gmail.com](mailto:kalkiuniversecasting@gmail.com)కు పంపించవచ్చు. నాగ్ అశ్విన్ సృష్టించిన 'కల్కి' యూనివర్స్‌లోని కథను మరింత విస్తరించేందుకు సీక్వెల్‌ను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. రెండో భాగంలో కథ మరింత ఆసక్తికరంగా ఉండబోతుందనే అంచనాలు ప్రేక్షకులతో పాటు ఇండస్ట్రీ వర్గాలతో నెలకొన్నాయి. ఇప్పటికే ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి స్టార్ కాస్ట్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యూనివర్స్‌లో కొత్త నటీనటులకు అవకాశం కల్పించడంతో.. నటన రంగంలోకి రావాలనుకునే వారికి ఇది మంచి ఛాన్స్‌గా ఉంటుందని చెబుతున్నారు. ఆసక్తి ఉన్నవారు పైన ఇచ్చిన మెయిల్ అడ్రస్‌కి మీ వివరాలను పంపించండి.

## బాబీ దర్శకత్వంలో చిరు చిత్రం



మెగాస్టార్ చిరంజీవి తన 158వ చిత్రాన్ని దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రస్తుతం ఫిలింనగర్‌లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో యువ నటి మీనాక్షి చౌదరి ఒక కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలోని ఒక పాత్ర కోసం చిత్రబృందం మీనాక్షి చౌదరితో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఆమె ఇందులో కథానాయికగా కాకుండా, ఒక కీలకమైన అతిథి పాత్రలో మాత్రమే కనిపించనున్నారని సమాచారం. ముఖ్యంగా సినిమా ద్వితీయార్ధంలో ఆమె పాత్రకు సంబంధించిన సన్నివేశాలు ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాలో కథానాయిక ఎవరనే దానిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అసలు ఈ చిత్రంలో పూర్తి స్థాయి హీరోయిన్ పాత్ర ఉంటుందా? లేదా? అనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, మీనాక్షి చౌదరి చేరికపై చిత్ర యూనిట్ నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

## పవర్‌ఫుల్ పోలీస్‌గా టబు



స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది.

ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## చీరకట్టులో కవ్విస్తున్న రీతూ వర్మ



అందాల తార, తెలుగు అందం రీతు వర్మ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. విజయ్ దేవరకొండ హీరోగా ఇండస్ట్రీకి పరిచయం అవుతూ వచ్చిన పెళ్లిచూపులు సినిమాతో హీరోయిన్గా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ చిన్నది. సరైన అవకాశం లభించాలే కానీ తన నటనతో అదరగొట్టేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఈమె.. ఇటు ఇంస్టాగ్రామ్ వేదికగా కూడా సందడి చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా ఎల్లో కలర్ చీర కట్టుకొని తన గ్లామర్ లుక్కుతో ఆడియన్స్ హృదయాలను దోచుకునే ప్రయత్నం చేసింది. ప్లెయిన్ ఎల్లో కలర్ చీరకు హెవీ ఎంబ్రాయిడరీ తో బోర్డర్ డిజైన్ చేయగా.. దీనికి కాంబినేషన్లో హెవీ డిజైన్ కలిగిన స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి తన అందాలతో తన మేకప్ లుక్ ను ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక నడుము కనిపించేలా చీర కట్టిన ఈమె ఆ నడుము వయ్యారాలతో కుర్రకారు గుండెల్లో గుణపాలు దించింది.. రీతు వర్మ లేటెస్ట్‌గా ఇన్స్టా గ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. రీతు వర్మ సినిమాలే కాదు అటు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. రీతు వర్మ ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. ప్రముఖ హీరో గోపీచంద్ తో కలిసి భరతవర్ష అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో ఒక విభిన్నమైన పాత్రలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఈ చిత్రంతోపాటు తమిళ్‌స్టై సినిమా ధ్రువ నక్షత్రంలో కూడా నటిస్తోంది. వీటితోపాటు మరికొన్ని చిత్రాలలో హీరోయిన్గా అవకాశాలు అందుకుంటున్నాయి. ఇటు సోషల్ మీడియాలో కూడా సందడి చేస్తూ ఎప్పటికప్పుడు ఆడియన్స్ కు చేరువలో ఉంటుంది. మొత్తానికైతే ఈమె షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయని చెప్పవచ్చు..

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com